క్లుప్తంగా

హజ్ యాత్రికులకు సన్మానం


హజ్ యాత్రికులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: హజ్ యాత్రకు వెళ్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి మస్తాన్‌వలి కుటుంబసభ్యులను గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సన్మానించారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లోని మస్తాన్‌వలి నివాసానికి వెళ్లిన వైవీఆర్ హజ్‌కు వెళ్తున్న వారిని పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, పార్టీ నాయకులు దశరథరెడ్డి, ఎం.తిమ్మారెడ్డి, యూసుఫ్‌ఖాన్, నూర్‌నిజామి, జమీల్, పార్టీ పట్టణ కార్యదర్శి కరీమ్‌ఖాన్, రహంతుల్లా, టీటీఈ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి జ్యోతుల సమర్పణ


జ్యోతులు ఎత్తుకుని నృత్యం చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం చేనేత కాలనీ వాసులు చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీదేవి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాన్ని తెల్లవారుజాము నుంచి ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ జ్యోతులు ఎత్తుకుని నృత్యం చేశారు. భక్తులు అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ట


వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినాయక విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చిలకల రాజుగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుడు వెంకటేష్ అర్చక బృందం సారథ్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ కలశ స్థాపన, విగ్రహ ఆదివాసాలు, వినాయక, నవగ్రహ, సర్వదేవత హోమాలు, విగ్రహ ప్రతిష్ట గావించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు


లక్ష్మీ నరసింహ్మస్వాముల ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మనచెరువులో లక్ష్మీ నరసింహ్మస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఉత్సవమూర్తులను జూటూరు గ్రామంలోని జేసీ వంశస్తుల ఇంటివద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. తలంబ్రాల బియ్యం, ముత్యాలు, పట్టు వస్త్రాలను తీసుకుని అక్కడి నుంచి కొండపైకి మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. సోమవారం తెల్లవారుజామున నరసింహస్వామి కల్యాణోత్సవం తిరుపతి వేద పండితుల చేతులమీదుగా నిర్వహించనున్నారు. ఊరేగింపులో మహిళల కోలాటం ఆకట్టుకుంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

16,17న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


లక్ష్మీ చెన్నకేశవస్వామి

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలో ఈనెల 16, 17న లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 16న సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగించి 17న స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు గ్రామపెద్దలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వేడుకలను తిలకించడానికి, ఇలవేల్పును దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

మున్సిపాలిటీపై బకాయిల బండ

- రూ.74 లక్షల ఆస్తి పన్ను బకాయిలు
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు


ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్

తాడిపత్రిరూరల్: మున్సిపాలిటీకి ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను మొండి బకాయిలు గుదిబండగా తయారయ్యాయి. వివిధ రకాల అభివృద్ధి పనులకు ఉపయోగపడే బకాయిల వసూళ్లపై అధికారులు నోటీసులు పంపుతున్నారు. కానీ వసూలు కావడం లేదు. ఏళ్ల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయి. ఆయా శాఖల మధ్య ఉన్న అవగాహన వల్ల కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. అదే ప్రజల విషయాన్ని వస్తే ఎన్ని రకాలు ఉంటే అన్ని రకాల ఒత్తిడులతో బలవంతంగా వసూలు చేస్తున్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖలకు కేటాయించే బడ్జెట్‌లో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అరకొర బడ్జెట్ కేటాయింపు వల్ల శాఖల నిర్వహణకే సరిపోకపోవడంతో.. పన్నులు ఎలా చెల్లించాలో తెలియడం లేదని అధికారులు వాపుతున్నారు. మునిసిపల్ అధికారులు పంపుతున్న నోటీసులను ఉన్నతాధికారులకు పంపడం తప్ప తమ చేతిలో ఏమి లేదని అంటున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లో అనర్హులు

పట్టణంలోని సీబీరోడ్డు, హరిజన వాడల్లోని ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల ద్వారా దాదాపు రూ.6.58 లక్షల బకాయిలు రావాల్సి ఉంది. ఎన్నో ఏళ్లుగా బకాయిలు చెల్లించడం లేదు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లో అర్హులకంటే అనర్హులే ఎక్కువ ఉన్నారు. కార్పొరేషన్‌కు చెల్లించే అద్దె కంటే ఎక్కువ వసూలు చేస్తూ అనర్హులకు బాడుగకు ఇస్తున్నారు. వారి నుంచి నెల నెలా అద్దె రూపంలో రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నా మునిసిపాటికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను మాత్రం పెండింగ్‌లో పెడుతున్నారు. మున్సిపల్ అధికారులు కూడా వారిపై ఒత్తిడి చేయడం లేదు. అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో లక్షల్లో బకాయిలు పేరుకుపోతున్నాయి.

పన్నులు వసూలు కాకుంటే నిర్వహణ ఎలా?

మున్సిపాలిటీ అభివృద్ధికి పన్నుల వసూలు ఆయువు పట్టు. మునిసిపాలిటీకి వివిధ రకాల నిధుల మంజూరులో ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తోంది. మునిసిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులు, నీటి సరఫరా, వివిధ రకాల ఖర్చులు, కార్యాలయ నిర్వహణ తదితర వాటి కోసం జనరల్ పండ్ ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టణ అవసరాల కోసం నీటి సరఫరాకు వచ్చే పన్ను కంటే ఎక్కువ మొత్తాన్ని ఖర్చుచేస్తున్నారు. అదనంగా ఖర్చు చేసే మొత్తాన్ని ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగిస్తున్నారు. పైపులైన్ల మరమ్మతులు, కొత్త పైప్‌లైన్లు, పారిశుద్ధ్యం నిర్వహణకు జనరల్ ఫండ్స్ దిక్కుగా మారాయి.

బకాయిలపై ఒత్తిడి తెస్తున్నాం



మునిసిపాలిటీకి ఆస్తి పన్ను రూపంలో పెద్ద బకాయిలపై వివిధ శాఖల అధికారులపై ఒత్తిడి తెస్తున్నాం. నోటీసుల రూపంలో ఉన్న బకాయిల వివరాలు తెలియజేస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం. బకాయిల చెల్లింపును బడ్జెట్‌పై ముడిపెడుతున్నారు.

– శివరామక్రిష్ణ, కమిషనర్

తాడిపత్రిలో ఇలా..

కార్యాలయం	బకాయిలు
వ్యవసాయశాఖ	రూ.14,88,008
రోడ్లు, భవనాలశాఖ	రూ.8,06,623
ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్‌లు	రూ.6,58,084
కోర్టు	రూ.82,282
ప్రభుత్వాస్పత్రి	రూ.9,28,648
డీఎస్పీ కార్యాలయం , పోలీసు స్టేషన్, పోలీసు క్వార్టర్స్	రూ.7,90,155
హెచ్చెల్సీ కార్యాలయం, క్వార్టర్స్	రూ.5,63,989
తహసీల్దార్ కార్యాలయం	రూ.18,702
ఎస్సీ బాలుర హాస్టల్	రూ.4,85,364
ఎస్సీ బాలికల హాస్టల్	రూ.9,56,994
సాంఘిక సంక్షేమశాఖ	రూ.1,16,799
సబ్‌రిజిస్టర్ కార్యాలయం	రూ.2,15,907
ఆర్‌అండ్‌బీ బంగ్లా	రూ.1,31,851

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పుట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెద్దవడుగూరులో కలుసుకున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు


శింగనమల జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పుట్లూరు/పెద్దవడుగూరు: పుట్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–1988 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అనారోగ్యం, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న స్నేహితులకు ఆర్థిక సాయం చేసి ఆదర్శంగా నిలిచారు. అలాగే పెద్దవడుగూరులోని జెడ్పీ పాఠశాలలో 2002–2003లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను సన్మానించారు.

- శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు శ్రీనివాసులు, దివాకర్‌రెడ్డి, ముని స్వామి, చంద్రశేఖర్, రాంభూపాల్, వీబీ ఆదినారాయణ, తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

పామిడి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సారథ్యంలో తరిమెల రాజు కళాబృందం ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ నియంత్రణపై పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వీధి నాటకం ప్రదర్శించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది? ఎలా నియంత్రించాలి? తదితర అంశాలకు సంబంధించి నాటక ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, ఓఆర్‌డబ్ల్యూ జ్యోష్ణ, కృష్ణవేణి, షంషాద్, కళాకారులు వెంకటేష్, తిప్పేస్వామి, పుష్పా, సరోజు, ప్రజలు పాల్గొన్నారు.

జోహార్ మురళీనాయక్


గుంతకల్లులో వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు


గుత్తిలో మురళి నాయక్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


పుట్లూరు మండలం శనగలగూడూరులో వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు


పామిడిలోని సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పుట్లూరు/పామిడి: భారత్–పాక్ మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కళ్లితాండాకు చెందిన జవాన్ మురళి నాయక్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం రాత్రి గుంతకల్లులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి జోహార్లర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొనకొండ్ల అంజి, సీనియర్ నాయకుడు దశరథరెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు బాసిద్, షాబుద్దీన్, పవన్, పెయింటర్ హరి, పట్టణ కార్యదర్శి కరీమ్‌ఖాన్, నాయకులు తిమ్మప్ప, మహ్మద్‌హుసేన్, జిలాన్, గఫార్, ఖలీఫా, తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతీయ జెండాలను పట్టుకుని గాంధీచౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ మాజీ సైనికులు ర్యాలీ చేశారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు ఎ.వెంకటరామిరెడ్డి, కోశాధికారి భీమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తిలో వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ పీరా, రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ సీవీ రంగారెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, కేవీ రమణ, నాయకులు వెల్డింగ్ రఫూఫ్, గురుప్రసాద్ యాదవ్, రమేష్ రెడ్డి, రంగస్వామి, బింగి కిరణ్ బాబు, హమాలీ రామాంజి, సునీల్, మల్లి, బ్రహ్మ కుమార్, అబ్దుల్, రాజారెడ్డి తదితరులు జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పించారు. అలాగే పుట్లూరు మండలంలోని శనగలగూడూరులో న్యాయవాది నామాల భాస్కర్‌రెడ్డితో పాటు గ్రామస్తులు జయరామిరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. అదేవిధంగా వీరజవాన్ మృతిపై పామిడిలోని సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి



కసాపురంలో నరసింహస్వామి జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లురూరల్/గుత్తి/గుత్తిరూరల్:: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి నృసింహ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ముఖమండపంలో నరసింహ స్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామివారిని స్తంభంలో ఆవాహనం చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే గుత్తి పట్టణంలోని కోటలో ఉన్న నరసింహస్వామి దేవాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆలయంలో లక్ష్మీ నరశింహ స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సాగునీరు అందించి ఆదుకోండి

పెద్దవడుగూరు: యాడికి కాలువ ద్వారా బీడు భూములకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మండల సీపీఐ నాయకులు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని కడదరగుట్టపల్లి వద్ద ఉన్న యాడికి కాలువ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. యాడికి కాలువ ద్వారా సాగునీరు తీసుకెళ్లి వందల ఎకరాలకు అందిస్తే పెద్దవడుగూరు, యాడికి మండలాలు సస్యశ్యామలం అవుతాయని గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి యాడికి కాలువ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం కాలువకు నీరు అందించకపోవడం వలన భూములు బీళ్లుగా మారుతున్నాయని, కూటమి ప్రభుత్వం కాలువ ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గం రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, రంగస్వామి, అల్లాబకాస్, గంగన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బండి శూల తిరునాల


రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను అలంకరించిన దృశ్యం

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బండిశుల తిరునాల ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామదేవతలైన సుంకులమ్మ, ముత్యాలయ్యను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. గ్రామదేవరలో భాగంగా అతిథులను ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఐదురోజుల క్రితం రామరాజుపల్లిలో అట్టహాసంగా ప్రారంభమై కాసేపల్లి, గుత్తి–అనంతపురం మీదుగా బండిశూల కొనసాగుతూ చివరిరోజు ఆదివారం వేకువజామున రామరాజుపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీపీ భోగాతి మురళీమోహన్ రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాలురెడ్డి తిరునాల విశిష్ఠతను వివరించారు.

'చాగల్లు'లో తేలిన శ్రీరాములు మృతదేహం

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు సమీపంలో చాగల్లు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో శనివారం గల్లంతైన శ్రీరాములు (48) మృతదేహం రిజర్వాయర్‌లో ఆదివారం తేలియాడుతూ కనిపించింది. గుర్తించిన మత్స్యకారుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్ పరిధిలోని తోళ్ల షాపు కాలనీలో నివాముంటున్న అమీర్‌బాషా (47) అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. శరీరం ఉబ్బిపోయి ఉంది. రెండు రోజుల క్రితం ఆయన మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆయన స్వస్థలం వైఎస్సార్ జిల్లా కమలాపురం. 20 ఏళ్ల క్రితం వలస వచ్చి గుత్తి ఆర్‌ఎస్‌లో స్థిరపడ్డాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా, ప్లంబర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే గత మూడేళ్లుగా భార్య, కుమార్తెలకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం తన ఇంట్లోనే మృతదేహమై కనిపించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఒకరికి గాయాలు

పామిడి: పట్టణంలోని వై జంక్షన్ సమీపాన ఆదివారం కారు–స్కూటర్ ఢీ కొని బీసీ కాలనీకి చెందిన షెక్షావలి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. షెక్షావలి పనిమీద గుత్తి వైపు స్కూటర్‌లో బయలుదేరాడు. అదే సమయంలో అనంతపురం వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొంది. ఘటనలో షెక్షావలి తీవ్రంగా గాయపడ్డాడు. షెక్షావలి ఫిర్యాదు మేరకు పామిడి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరిడికొండలో అటవీ అధికారుల విచారణ


విచారణ చేస్తున్న అటవీ అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో చిరుతలు సంచరించాయన్న వదంతుల నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు ఆదివారం విచారణ చేశారు. గ్రామ శివారులో కంకర క్రషర్‌కు వెళ్లే దారిలో పై నుంచి నాలుగు చిరుతలు వచ్చినట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గుత్తి అటవీ శాఖ గార్డు రమేష్ కొండ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. స్థానిక యువకులతో కలిసి గాలించారు. అయితే చిరుతలకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేదా పాదముద్రలు లభించ లేదు. ఈ సందర్భంగా గార్డు రమేష్ మాట్లాడుతూ చిరుతలు సంచారిస్తున్నాయిని వైరల్ అయిన వీడియో ఫేక్ అని, ప్రజలు, కంకర క్రషర్‌కు వెళ్లేవారు, ఉపాధి కూలీలు ఎవరూ భయాందోళన చెందవద్దన్నారు.

కసాపురంలో ఆయుష్య హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ యాగశాలలో నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుష్య హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గ్రామోత్సవం


పెద్దమ్మతల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం పెద్దమ్మ తల్లి, సుంకులమ్మ తల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ ప్రజలు శనివారం అర్ధరాత్రి నుంచి గ్రామంలో డప్పులు వాయిస్తూ తిరిగారు. ఉదయాన్నే అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాయ కర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న వాసవీ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా వేదపండితులు లక్ష్మీ నరసింహ కలశారాధనతో పాటు సుదర్శన చక్రానికి పంచామృతాభిషేకం, సుదర్శన హోమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. సాయంత్రం భజన మండలి వారిచే సహస్రనామ స్తోత్రం, వాసవీ జీవిత గేయ పారాయణం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం

తాడిపత్రి: మండలంలోని జంబులపాడు గ్రామంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు ఎ. మురళీక్రిష్ణ ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఆఖరి రోజు శ్రీదేవి, భూదేవి, సమేత లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి భక్తులు హాజరు కావాలన్నారు.

యువకుడి మృతి

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మాచినేని మహేంద్ర(24) అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు మాచినేని మాదన్న, జయమ్మ దంపతుల కుమారుడు మహేంద్ర కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడు. పలు చోట్ల చికిత్స చేయించుకున్న కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఈ నెల 8న గ్రామ శివారులోని పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్నేహితులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కర్నూలులోని సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేంద్ర మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సూక్ష్మ సేద్యాన్ని అమలు చేయాలి

గుంతకల్లు రూరల్: మండలంలోని చెరువులన్నింటికీ హంద్రీ–నీవా జలాలను అందించి సూక్ష్మ సేద్యం అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ.జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని దోనిముక్కల గ్రామంలో గ్రామీణ మండల మహాసభ నిర్వహించారు. మండల సహాయ కార్యదర్శి పి.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా జగదీష్‌తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి తదితరులు హాజరయ్యారు. ముందుగా వారు పాకిస్తాన్, భారత్ యుద్ధంతో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్కమ్మగార్ల ఆలయంలో పూజలు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఆదివారం అక్కమ్మగార్ల పరుష సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు ప్రతి ఇంటి నుంచి టెంకాయలు కొట్టి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ చివర ఉన్న కొండ మీద ఉన్న స్వాములను రెడ్డిపల్లి కొత్తబావి దగ్గరకు తీసుకెళ్లారు. సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు కొత్తబావి నుంచి జలధికి స్వాములు వస్తాయని గ్రామపెద్దలు తెలిపారు.